క్లుప్తంగా

ఎమ్మెల్యే కొఠారును కలిసిన పెదవేగి ఎస్సై



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై రాజేంద్రప్రసాద్

దెందులూరు: పెదవేగి మండల నూతన ఎస్సైగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎస్సై కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

గాయపడిన జర్నలిస్టుకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: దెందులూరు 'సిద్ధం' సభలో అనారోగ్యానికి గురైన జర్నలిస్టును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ఏపీడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.మాణిక్యరావు ఉన్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి నిధుల మంజూరు



ఆలయ పునర్నిర్మాణానికి మంజూరైన నిధుల చెక్‌ను అందజేస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామం దళితవాడలో కోదండరామాలయం పునర్నిర్మాణానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ దేవదాయశాఖ ద్వారా మంజూరైన ప్రభుత్వ నిధులను కమిటీ సభ్యులకు అందజేశారు. దేవులపల్లి గ్రామానికి చెందిన నాయకులు జీ. పాపారావు శ్రీ కోదండ రామాలయ పరిస్థితి, పునర్నిర్మాణం ఆవశ్యకతను ఎంపీకి వివరించారు.దీనిపై స్పందించిన ఎంపీ శ్రీధర్ రూ.10 లక్షల మంజూరయ్యేలా కృషి చేశారని ఆలయ ప్రెసిడెంట్ కొత్తూరు విజయరాజు తెలిపారు. దీనిలో భాగంగా మొదటి విడతలో మంజూరైన రూ.3లక్షలు చెక్కును ఆదివారం ఎంపీ తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రగడ గోపాల్, కార్యదర్శి కట్టూరి యువరాజు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



గుడిపాడులో పోలేరుమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్

పెదపాడు: గ్రామ దేవతలను, పొలిమేరల్లోని అమ్మవార్లను పూజించడం తరతరాలుగా వస్తున్న గ్రామీణ సంప్రదాయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మండలంలోని గుడిపాడులో పోలేరమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు గ్రామస్తులను కాచి కాపాడుతూ అంటు వ్యాధుల నుంచి రక్షిస్తూ, పంటలు సంవృద్ధిగా పండేలా దీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. పోలేరుమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు ఘంటసాల ప్రభాకరరావు, ఘంటసాల సుబ్బారావు, పాల్గొన్నారు.

చిన్నారులు ఉన్నతికి 'చదవడం మాకిష్టం' దోహదం



భీమడోలులో చిన్నారులకు నీతి కథలు చెబుతున్న మండే సుధాకర్

భీమడోలు: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు చదవడం మాకిష్టం కార్యక్రమం చక్కని మార్గమని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం, పుస్తక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని పుస్తకాలను చదివారు. ముఖ్య అతిథిగా హాజరైన మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, ఎస్.కృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

'సిద్ధం' మహా సభ విజయవంతం

- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- మళ్లీ వచ్చేది వైఎస్ జగనన్న ప్రభుత్వమే
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



దెందులూరు సభకు లక్షలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు (ఫైల్)

దెందులూరు: దెందులూరులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల సన్నాహక 'సిద్ధం' సభ విజయవంతమైంది. వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు సభలో నాలుగు లక్షల మందికిపైగా ఉన్నారు. సభ నుంచి సోమవరప్పాడు బైపాస్ వరకు ఇటు గుండుగొలను వంతెన వరకు, వైఎస్సార్ సీపీ శ్రేణులు వచ్చిన వాహనాల రద్దీ నెలకొంది. తమ ఆరాధ్య నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ఆయన చెప్పే ప్రసంగాన్ని వినేందుకు లక్షలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ప్రాంతాలకు అతీతంగా దెందులూరు సభకు వచ్చారు. దెందులూరు సభ కనివినీ ఎరుగని రీతిలో గ్రాండ్ సక్సెస్ కావడంపై వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీతో పాటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది వృద్ధులకు సైతం గతంలో ఎన్నడూ దెందులూరు, జిల్లాలో ఇటువంటి సభ జరగలేదని అంటున్నారు. సీఎం ప్రసంగం ప్రారంభించిన దగ్గర నుంచి ఆద్యంతం నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. చంద్రబాబు దుర్మార్గమైన, ప్రజావ్యతిరేక పాలనను విమర్శించారు. మంచి కోసం పాటుపడుతున్న మీ బిడ్డపై విశ్వాసం ఉంటేనే ఓటు వేయండి అని సీఎం జగన్ చెప్పిన ప్రతిసారీ సభలో ఉన్న లక్షలాది మంది జనం వారి హర్షధ్వానాల మధ్య వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు మేము సిద్ధం అంటూ ఆమోదం తెలిపారు.

సభ గ్రాండ్ సక్సెస్



అందరి సహకారంతో దెందులూరు సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అన్ని విభాగాల పార్టీ శ్రేణులు ముఖ్యంగా దెందులూరు నియోజకవర్గ ప్రజలు మద్దతు, ఆదరణ, అభిమానం, తాను ఎన్నటికీ మరువలేనని సీఎం వైఎస్ జగన్ అన్నారు. నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, తొమ్మిది రోజులుగా శ్రమించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

గర్వకారణంగా ఉంది



దెందులూరులో ఇంతటి భారీ సభ నిర్వహించడం, కనివినీ ఎరుగని రీతిలో విజయవంతం కావడం గర్వకారణంగా ఉంది. విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా ఉన్న సీఎం జగన్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నానికి రాజకీయాల్లో ఎంతో భవిష్యత్తు ఉంది. రానున్న ఎన్నికల్లో వచ్చేది జగనన్న ప్రభుత్వమే.

– ఘంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

దళితులకు గుర్తింపు



సభ విజయవంతం కావడానికి జిల్లా నలుమూలల నుంచి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులకు, అభిమానులకు రుణపడి ఉంటాను. సీఎం జగన్ రైతుల పక్షపాతి. ఏ ముఖ్యమంత్రి ఇవ్వని ప్రాధాన్యత, రిజర్వేషన్లు, వైఎస్సార్ తనయుడిగా వైఎస్ జగన్ అమలు చేశారు. దళితులను గుర్తించి గౌరవించారు.

– గొల్ల కిరణ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

మహిళలందరికీ కృతజ్ఞతలు



దూర ప్రాంతాల నుంచి దెందులూరు సభకు విచ్చేసిన మహిళలందరికీ కృతజ్ఞతలు. సీఎం వైఎస్ జగన్ మహిళాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. అన్ని పదవుల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారు. దెందులూరు సభ విజయవంతం కావడం సంతోషంగా ఉంది.

– నిట్టా లీలానవకాంతం గంగరాజు, జెడ్పీటీసీ, దెందులూరు

ధ్యానం, యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం



పూళ్లలో ధ్యాన శిక్షణ తరగతుల ముగింపు సభలో మాట్లాడుతున్న ధ్యాన గురువు శోభారాణి

భీమడోలు: యోగా, ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తి వృద్ధి, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఖమ్మం జిల్లా ఆధ్యాత్మిక ధ్యాన గురువు శోభారాణి అన్నారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలువేల్పు భవానీ ఆలయం వద్ద పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల ధ్యాన శిక్షణ కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి పచ్చా రాజేష్ అధ్యక్షత వహించారు. పూళ్ల, ఎంఎం పురం, సాయన్నపాలెం, రామన్నగూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు, యువత, చిన్నారులకు ధ్యాన శిక్షణను అందించారు. తొలుత శోభారాణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట గోదావరి పిరమిడ్ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు, ప్రతినిధులు పచ్చా వెంకటేశ్వరరావు, పిన్నింటి అప్పారావు, గేదెల అప్పన్న, పచ్చా రాజు, మౌనిక, పుష్ప, పచ్చా హేమ కుమార్, యువకులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం జగన్‌కే సాధ్యం

- రాష్ట్ర భవిష్యత్తు కోసం వైఎస్సార్ సీపీకి ఓటు ఇవ్వండి
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- గొల్లగూడెం, ఉంగుటూరులో ఆసరా చెక్కుల పంపిణీ



గొల్లగూడెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



గొల్లగూడెం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, చిత్రంలో ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: బడుగు, బలహీన వర్గ కుటుంబాలు మేలు కోసం, రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించేందుకు ప్రజలంతా సీఎం జగన్‌కు మరోమారు ఓటు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉంగుటూరులో 11 గ్రామ పంచాయతీలకు చెందిన 623 గ్రూపులకు చెందిన 6,178 మంది సభ్యులకు రూ.4.91 కోట్ల చెక్కును, గొల్లగూడెంలో 8 గ్రామ పంచాయతీలకు చెందిన 214 డ్వాక్రా గ్రూపులకు చెందిన 2,170 మంది సభ్యులకు రూ.1.83 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే వాసుబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలలో వాసుబాబు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో ఏ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.61 కోట్లు వడ్డీ ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు. రూ.3 వేల పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులు చేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా రైతులకు, పేదలకు సత్వర సేవలందిస్తున్నామని తెలిపారు. అవినీతి రహిత పాలన జగన్ పాలనలోనే సాధ్యమయ్యిందని వాసుబాబు వివరించారు. డీఆర్‌డీఏ, డీపీఎం అనిత, ఏపీవో పద్మావతి, మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, మహిళా విభాగం అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, సచివాలయాల అధ్యక్షుడు పెనుగొండ బాలకృష్ణ, పంచాయతీరాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, గొల్లగూడెంలో నాయకులు దాసరి సత్యనారాయణ, నాగు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజనేయులు, సీసీ నిర్మలకుమారి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీల నాయకులు పాల్గొన్నారు. డ్వాక్రా సీసీలు పాల్గొన్నారు. తొలుత సభలవద్ద జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు.

భీమడోలు: పూళ్ల ఉన్నత పాఠశాలలో ఈనెల 5వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆసరా సంబరాల్లో భాగంగా రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు భీమడోలు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల కన్వీనర్ రామకుర్తి నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తెలిపారు. పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా రుణమాఫీ చెక్కులను అందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం.. ఆత్మీయ పలకరింపులు



గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో కలిసిన 1978-79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

గణపవరం: బాల్య స్మృతులను నెమరువేసుకునేందుకు, భావోద్వేగంతో కూడిన ఆత్మీయ పలకరింపులకు గణపవరం బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది. వారంతా నాలుగున్నర దశాబ్దాల క్రితం సహ విద్యార్థులు, ఒకే పాఠశాలలో, ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు. నిన్న మొన్నటి వరకూ కుటుంబ, ఉద్యోగ, వ్యాపార బాధ్యతలు మోసి, ఇప్పుడు కాస్త సమయం దొరకడంతో మనుమలు, మునిమనుమలతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్న సీనియర్ సిటిజన్లు. ఐదు దశాబ్దాల క్రితం వారంతా గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకుని, 1978–79లో పదో తరగతి పూర్తిచేసి, వివిధ మార్గాలు ఎంచుకుని వివిధ ప్రాంతాల్లో, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. పాఠశాలను వదిలి వెళ్లిన నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఈనెల 4వ తేదీ ఆదివారం తామంతా చదువుకున్న పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారు ఈ సమ్మేళనానికి హాజరై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగి మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను తలచుకుని భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఆట పాటలతో, తమ అనుభవాలను పంచుకుంటూ సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములు కావాలని నిర్ణయించారు. విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి షెడ్డును నిర్మించేందుకు నిర్ణయించారు. పులవర్తి సూర్యనారాయణ, సంకు ఏసుబాబు, కె.హరనాథ్, సప్ప గోవింద్ తదితరులు కార్యక్రమ ఏర్పాటుకు కృషి చేశారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం

- ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ
- ఏలూరులో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్

ఏలూరు టౌన్: ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమని, సమాజంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని, ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోందని ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్ అన్నారు. ప్రజల జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏలూరు నగరంలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేడు అధికంగా ఊపరితిత్తుల క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారని, ధూమపానం, పొగాకు వినియోగం, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారటంతో ఆరోగ్యం దెబ్బతింటోందని చెప్పారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన హితవు పలికారు. వైద్య విద్యార్థులు ర్యాలీ అనంతరం వెంకటాపురంలోని రామ్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ గంగాభవానీ మాట్లాడుతూ క్యాన్సర్ నిరోధానికి ప్రతి ఒక్కరూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని కోరారు. సహాయ ఆచార్యులు డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటువ్యాధి కాదని, ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధికి పూర్తిస్థాయిలో చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ, ముందుగానే క్యాన్సర్ వ్యాధిని గుర్తిస్తే చికిత్స చేయటం సులభమవుతుందన్నారు. హెచ్‌పీవీ వాక్సిన్ ద్వారా చాలా రకాల క్యాన్సర్ వ్యాధులను నిరోధించే అవకాశం ఉందని తెలిపారు. పిల్లలకు హెఇపీ–బీ వాక్సిన్ ఇవ్వటం ద్వారా కాలేయ క్యాన్సర్‌ను నిరోధించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ఇతర విభాగాల అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజా బలం కరువు

ఉంగుటూరు: నారాయణపురంలో 40 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరారని చేస్తున్న ప్రచారాన్ని ఉంగుటూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు, నారాయణపురం ఎంపీటీసీ బండారు నాగరాజు ఆదివారం ఖండించారు. వారంతా టీడీపీ వారేనని మంగరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి క్యాడర్ ఎవరూ బయటకు వెళ్లలేదని స్పష్టం చేశారు. టీడీపీకి ప్రజా బలం లేదని, దీన్ని కప్పిపుచ్చేందుకు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని బండారు నాగరాజు చెప్పారు. దెందులూరు సిద్ధం సభకు వెళ్లిన జనాన్ని చూసి ప్రతిపక్షాల గుండెల్లో గుబులు మొదలైందని తెలిపారు. టీడీపీ క్యాడర్ బయటకు వెళ్లిపోతారేమోనన్న భయంతో ఆపార్టీ నాయకులు హడావుడి చేస్తున్నారని మంగరావు, నాగరాజు వివరించారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతలకు అభినందనలు



కబడ్డీ జట్టుతో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని

ఏలూరు టౌన్: ఆడుదాం ఆంధ్ర పోటీలతో యువత, విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతోపాటు స్ఫూర్తివంతమైన జీవన విధానాన్ని అవలంబించే అవకాశం ఏర్పడుతుందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని అన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ విజేతలుగా నిలిచిన ఏలూరు 23వ డివిజన్ ఫిరంగుల దిబ్బ టీమ్ సభ్యులు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ళనానిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాము సాధించిన కప్పులను ఎమ్మెల్యే నానికి చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలోని మన క్రీడాకారులు విజేతలుగా నిలవటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని, ఏలూరు నగరం, జిల్లా ప్రతిష్టను పెంచేలా ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడాకారులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు, క్రీడాకారులు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'తో .. ప్రతిభకు ప్రోత్సాహం

- యువతలో క్రీడాస్ఫూర్తి నింపిన 'ఆడుదాం ఆంధ్ర'
- దిగ్విజయంగా ముగిసిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు
- విజేతలకు రూ.15.50 లక్షల నగదు బహుమతుల ప్రదానం



ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీ (ఫైల్)

ఏలూరు రూరల్ : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు క్రీడాలోకానికి నూతన జవసత్వాలు అందించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి వరకూ ఆటల పోటీలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపాయి. ఏలూరు జిల్లాలో సచివాలయ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ 36 రోజుల పాటు కొనసాగిన ఆటల పోటీలు యువతను ఉర్రూతలూగించాయి. గ్రామాలు, పట్టణాల్లో సంబరాన్ని తలపించాయి. యువతీ, యువకుల్లో దాగిన అద్భుత ప్రతిభాపాటవాలు వెలుగు చూసాయి. బాలబాలికల్లో ఆటల పట్ల ఆసక్తిని పెంచాయి. ఆట స్థలాలు, క్రీడా మైదానాలు అభివృద్ధి చెందాయి. క్రీడాకారులు లక్షల రూపాయల నగదు బహుమతులు అందుకున్నారు. 2023 డిసెంబర్ 26న సచివాలయ స్థాయిలో ప్రారంభమైన పోటీలు ఫీవర్ జనవరి 2వ తేదీ వరకూ కొనసాగింది.

చరిత్ర లిఖించారు

డిసెంబర్ 26 ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ప్రారంభం రోజు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా చరిత్రలో లిఖించదగ్గ రోజు క్రీడా పండితులు వర్ణిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 605 సచివాలయల్లో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రూ.1.47 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, అంతే స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. అధికారులు వీరిని 14,354 జట్లుగా విభజించి కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో 7,198 మ్యాచ్‌లు నిర్వహించడం మరో విశేషం. పోటీల కోసం అధికారులు 320 ఆట స్థలాలను రూ 21.72 లక్షలతో అభివృద్ధి చేశారు. వీటితో పటు కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్రీడా దుస్తులు, పరికరాలు అందించడంతో క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేసారు.

భారీ నజరానా

క్రీడాకారులను ఉత్సాహపరచడానికి ప్రభుత్వం నగదు బహుమతులు అందించింది. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.35వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.60వేలు, రూ.30వేలు, రూ.10 వేలు కలెక్టర్ల చేతుల మీదుగా విజేతలు అందుకున్నారు. జిల్లాలో విజేతలందరూ రూ.15.50 లక్షలు నగదు బహుమతిగా అందుకున్నారు.

ఘనంగా నిర్వహించాం



గతంలో ఎన్నడూ ఆడుదాం ఆంధ్ర స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించలేదు. గ్రిక్స్, అసోసియేషన్ మీట్స్ సైతం ఇంత భారీ స్థాయిలో జరగలేదు. గతంలో ఎన్నడూ ఇంత మొత్తంలో భారీ నగదు బహుమతులు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆలోచన విజయవంతమైంది. 15 ఏళ్ల పైబడిన బాలబాలికలతో పాటు యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొడం విశేషం. జిల్లా స్థాయిలో విజేతలు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు.

– బి.శ్రీనివాసరావు, జిల్లా చీఫ్ కోచ్